కేంద్రరాష్ట్రాలు పోటీ.. నేతన్నల లూటీ!

- సంక్షేమ పథకాలన్నీ రద్దు చేసిన రెండు ప్రభుత్వాలు
- ఆదుకునే దిక్కులేక నేతన్నల అగచాట్లు
- కేసీఆర్ హయాంలో కార్మికులకు మహర్దశ
- ఏడాది పాడవునా ఉపాధి కల్పన

హైదరాబాద్, ఏప్రిల్ 14 (నమస్తే తెలంగాణ): చేనేత రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోటీపడుతున్నాయి. దేశంలోని నేత కార్మికుల సంక్షేమం కోసం ఎన్నో ఏండ్ల నుంచి కొనసాగుతున్న పథకాలను రద్దు చేయగా.. ఉద్యమ నేత కేసీఆర్ నేతృత్వంలోని గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రవేశపెట్టిన పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు పూర్తిగా రద్దు చేసింది. దీంతో నేతన్నలు తమను ఆదుకునే దిక్కులేక నానా అవస్థలు పడుతున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో వలసలు, ఆత్మహత్యలకు కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న చేనేత కార్మికులకు తెలంగాణ ఏర్పాటు తర్వాత మంచి రోజులొచ్చాయి. ప్రత్యేక రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం వ్యవసాయ రంగం తర్వాత చేనేత రంగాన్ని అత్యంత ప్రాధాన్య రంగంగా గుర్తించి అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టింది. నేతన్నలకు చేతినిండా పని కల్పించాలనే ఉద్దేశంతో బతుకమ్మ చీరల తయారీ కార్యక్రమాన్ని చేపట్టి ఏటా నేత సంఘాలకు సుమారు రూ.350 కోట్ల ఆర్డర్లు ఇచ్చింది. ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థుల యూనిఫామ్స్‌ను చేనేత కార్మికులతో తయారు చేయించేందుకు ఏటా రూ.200 కోట్లకుపైగా ఖర్చు చేయడంతోపాటు నూలు, రంగులు తదితర ముడి సరుకులపై 40 శాతం సబ్సిడీ అందించింది. రైతు బీమా తరహాలో నేతన్నకు బీమా పథకాన్ని ప్రవేశపెట్టి భరోసా కల్పించింది. దీంతో ఆత్మహత్యలు ఆగిపోవడమే కాకుండా బతుకుదెరువు కోసం గతంలో గుజరాత్, బొంబాయి తదితర ప్రాంతాలకు వెళ్లిన నేతన్నలు ఇంటిబాట పట్టారు.

కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన పథకాలు

- తెలంగాణ వీవర్స్ థ్రిఫ్ట్ ఫండ్ సేవింగ్ అండ్ సెక్యూరిటీ స్కీమ్ (టీఎఫ్ఎస్ఎస్ఎస్) ద్వారా నేతన్నలు పొదుపు చేసుకున్న సొమ్ముకు సమాన వాటాను బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది.
- రైతు బీమా తరహాలో నేతన్నలకు రూ.5 లక్షల బీమా సదుపాయాన్ని కల్పించింది.
- నూలు, రంగులు, రసాయనాలు, ఇతర ముడిసరుకుపై 40 శాతం సబ్సిడీ ఇచ్చింది.
- పావలా వడ్డీకి రుణాలు అందజేయడంతోపాటు మార్కెటింగ్ సపోర్ట్, క్యాష్ క్రెడిట్ సపోర్ట్ స్కీమ్‌ను ప్రవేశపెట్టింది.
- బతుకమ్మ చీరలు, సోషల్, బీసీ, ట్రైబల్ వెల్ఫేర్, గురుకులాలు, సర్వశిక్ష అభియాన్ విద్యార్థులకు అవసరమైన యూనిఫామ్‌ల తయారీ ఆర్డర్లను నేత సంఘాలకు ఇచ్చింది.
- రంజాన్ తోఫా, క్రిస్మస్ గిఫ్టులు చేనేత రంగం ద్వారానే తయారు చేయించింది.
- ఈ చర్యలతో ప్రతి నెలా ఒక్కో చేనేత కుటుంబానికి రూ.15 వేలకు తగ్గకుండా ఆదాయం.

మోదీ సర్కారు రద్దు చేసిన పథకాలు

- చేనేతపై వస్తు, సేవల పన్ను (జీఎస్టీ)ను 5 నుంచి 12 శాతానికి పెంచింది.
- ఆలిండియా హ్యాండ్లూమ్ బోర్డును 2020 జూలై 27న రద్దుచేసింది. దీంతో చేనేత రంగ అభివృద్ధి, పరిరక్షణకు నిర్ణయాధికార సంస్థ లేకుండా పోయింది.
- ఆలిండియా హ్యాండీక్రాఫ్ట్స్ బోర్డును 2020 ఆగస్టు 7న రద్దు చేసింది.
- 2020 ఆగస్టు 11న ఆలిండియా పవర్ లూమ్ బోర్డును రద్దు చేయడంతో దేశవ్యాప్తంగా 8 టెక్స్‌టైల్ పరిశోధనా సంస్థలు నిర్వీర్యమయ్యాయి.
- చిలపనూలు తయారీకి నిర్దేశించిన హాంక్ యార్న్ ఆబ్లిగేషన్ ఆర్డర్‌ను నిర్వీర్యం చేసింది.
- చిలపనూలు శాతాన్ని 40 నుంచి 15 శాతానికి తగ్గించడంతో మార్కెట్‌లో చిలపనూలు లభ్యత తగ్గి చేనేత రంగం మనుగడ ప్రశ్నార్థకంగా మారింది.
- చేనేత సహకార సంఘ సభ్యుల థ్రిఫ్ట్ ఫండ్ పథకం (కో-ఆపరేటివ్ థ్రిఫ్ట్ ఫండ్ సేవింగ్ సొసైటీ స్కీమ్)లో కేంద్రం వాటాగా ఉన్న 4 శాతాన్ని మోదీ సర్కారు చేసింది.
- చేనేత కార్మికులకు ఉద్దేశించిన లాంబార్డ్ హెల్త్ ఇన్సూరెన్స్ పథకాన్ని రద్దు చేసింది.
- చేనేత కార్మికులకు ఉద్దేశించిన మహాత్మా గాంధీ బున్‌కర్ బీమా పథకంతోపాటు హౌస్-కం-వర్క్‌షెడ్ పథకాలన్నింటినీ 2014లోనే రద్దు చేశారు.
- మార్కెటింగ్ ఇన్సెంటివ్ నిబంధనలను కఠినతరం చేసి ఆ పథకాన్ని నిర్వీర్యం చేసింది.
- హైదరాబాద్‌లో నేషనల్ టెక్స్‌టైల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌తోపాటు హ్యాండ్లూమ్ ఎక్స్‌పోర్ట్స్ ప్రమోషన్ కౌన్సిల్ ఏర్పాటును బుట్టదాఖలు చేసింది.
- హ్యాండ్లూమ్ టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటు ప్రతిపాదనను తుంగలో తొక్కింది.
- రాష్ట్రంలో 66 బ్లాక్ లెవల్ హ్యాండ్లూమ్ క్లస్టర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపితే 30 క్లస్టర్లు మాత్రమే మంజూరు చేసింది. వాటిలోనూ కేవలం 24 క్లస్టర్లకే నిధులు విడుదల చేసింది.
- చేనేత రంగంపై కేంద్రం చిన్నచూపు వల్ల నూలు, ఇతర ముడిసరుకుల ధరలు విపరీతంగా పెరిగాయి. దీనివల్ల చేనేత వస్త్రాల ధరలు అధికమవడంతో డిమాండ్ తగ్గిపోయింది.

'గురుకుల ఫుడ్‌పాయిజన్'పై విచారణ కమిటీ

- నివేదిక వచ్చిన తరువాత 'భువనగిరి బాధ్యుల'పై చర్యలు
- ఎస్సీ గురుకులాల కార్యదర్శి సీతాలక్ష్మి వెల్లడి

యాదాద్రి భువనగిరి/హైదరాబాద్ సిటీ బ్యూరో, ఏప్రిల్ 14 (నమస్తేతెలంగాణ): యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని ఎస్సీ గురుకుల పాఠశాలలో జరిగిన ఫుడ్ పాయిజన్‌పై విచారణ చేపట్టేందుకు ఆదివారం గురుకులాల సంయుక్త కార్యదర్శి అనంతలక్ష్మి ఆధ్వర్యంలో పెనేషియా ఓఎస్‌డీ ప్రశాంతి, విజిలెన్స్ అధికారి హుసేన్‌తో కమిటీని నియమించినట్టు ఎస్సీ గురుకులాల కార్యదర్శి సీతాలక్ష్మి తెలిపారు. ఈ ఘటనపై పూర్తి నివేదిక వచ్చాక బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ నెల 12, 13 తేదీల్లో గురుకులంలో ఫుడ్‌పాయిజన్ వల్ల కొందరు విద్యార్థులు విరేచనాలతో అస్వస్థతకు గురయ్యారు. వెంటనే పాఠశాల ప్రిన్సిపాల్ విద్యార్థులను భువనగిరి ఏరియా దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారని పేర్కొన్నారు. ఆరోతరగతికి చెందిన ఇద్దరు విద్యార్థులు (ప్రశాంత్, కృష్ణ) ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం ఉప్పల్‌లోని మిరాకిల్ దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారని తెలిపారు. ప్రశాంత్ ఆరోగ్య పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో వైద్యుల సూచన మేరకు బంజారాహిల్స్ రెయిన్‌బో దవాఖానకు తరలించినట్టు వెల్లడించారు. ప్రస్తుతం ఈ విద్యార్థికి వెంటిలేటర్‌పై వైద్యం అందిస్తున్నారని, ఇద్దరికి ఉస్మానియా దవాఖానలో, మరో 11 మందికి భువనగిరి ఏరియా దవాఖానలో వైద్యం చేస్తున్నారని, మిగిలిన వారి ఆరోగ్యం మెరుగుపడిందని వివరించారు.

వర్గీకరణతోనే మాదిగలకు న్యాయం

- మాదిగలకు అండగా నిలిచే వారికే మద్దతు
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ

జగిత్యాల జిల్లా కోరుట్లలో మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

కోరుట్ల, ఏప్రిల్ 14: ఏబీసీడీ వర్గీకరణతోనే మాదిగలకు న్యాయం జరుగుతుందని, మాదిగలకు అండగా నిలిచే పార్టీలకే తమ మద్దతు ఉంటుందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ స్పష్టం చేశారు. జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని కింగ్స్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ సదస్సులో ఆయన మాట్లాడారు. మాదిగల భవిష్యత్తు తరాల కోసమే తన పోరాటమని, ఎస్సీ వర్గీకరణ సాధించే వరకు విశ్రమించేది లేదని అన్నారు. ఎస్సీ వర్గీకరణ చేస్తామని నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్‌కు ఈ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని మాదిగలకు పిలుపునిచ్చారు. వర్గీకరణతోనే మాదిగ బిడ్డలకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు దక్కుతాయని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగలకు ఒక్కరికి కూడా సీటు ఇవ్వలేదని మండిపడ్డారు.

వడ్డీ వ్యాపారులపై పోలీసుల దాడులు

- మల్టీజోన్-1లో పోలీసుల విస్తృత సోదాలు
- భారీగా బంగారం, తాకట్టు పత్రాలు స్వాధీనం
- పలువురు వ్యాపారులపై కేసులు

హైదరాబాద్, ఏప్రిల్ 14(నమస్తే తెలంగాణ): అవసరానికి డబ్బు ఆశ చూపి వడ్డీలు, చక్రవడ్డీల పేరిట అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారు కొందరు వ్యాపారులు. వారికి ఫైనాన్స్ సంస్థలు కూడా తోడవడంతో ఈ దందా అడ్డూ అదుపూ లేకుండా కొనసాగుతున్నది. దీంతో ఆ అప్పులు, వడ్డీలు చెల్లించలేక ఎంతో మంది బాధితులు ఆత్మహత్య చేసుకుంటున్నారు. ఇలాంటి కేసులు మల్టీజోన్-1 పరిధిలో భారీగా నమోదుతుండటంతో ఐజీ ఏవీ రంగనాథ్ ఆ జోన్ పరిధిలోని ఎస్పీలకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. ఆ ఆదేశాల మేరకు ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలు, వడ్డీ వ్యాపారుల ఇండ్లలో స్పెషల్ బ్రాంచ్ పోలీసులు విస్తృతంగా సోదాలు చేపట్టారు. ఈ సోదాల్లో భారీగా నగదు, బంగారం, ప్రామిసరీ నోట్లు, ల్యాండ్ డాక్యుమెంట్లు, పట్టాదారు పాస్ పుస్తకాలు, చెక్కులు, ఏటీఎం కార్డులు పట్టుబడటంతో వారిపై కేసులు నమోదు చేశారు. ఇకపై డబ్బుల కోసం వడ్డీ వ్యాపారులెవరైనా ఇబ్బందులకు గురిచేస్తే బాధితులు వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఐజీ సూచించారు. ప్రజలను పీడించే వడ్డీ వ్యాపారులను సహించే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

గురుకుల డిగ్రీలో ప్రవేశాలకు నేడే ఆఖరు

హైదరాబాద్, ఏప్రిల్ 14(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకుల డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాలకు దరఖాస్తు గడువు సోమవారం ముగియనున్నది. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 28న నిర్వహిస్తారు. 2024-25 విద్యా సంవత్సరానికి డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. వివరాలు, దరఖాస్తు చేసేందుకు tsrdccet.cgg.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలి. ఇదిలావుండగా, బీసీ గురుకుల జూనియర్ కాలేజీల్లో ప్రవేశాలకు కూడా సోమవారం వరకే దరఖాస్తు చేసే అవకాశం ఉన్నది. ఏప్రిల్ 28న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. పదోతరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు జూనియర్ కాలేజీల్లో చేరేందుకు mjpabcwreis.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

లాసెట్ దరఖాస్తుకు నేడే ఆఖరు

హైదరాబాద్, ఏప్రిల్ 14 (నమస్తే తెలంగాణ): లా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే లాసెట్, పీజీ లాసెట్ దరఖాస్తుల స్వీకరణ గడువు సోమవారం ముగియనున్నది. ఆలస్య రుసుముతో మే 25 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆదివారం నాటికి మూడేండ్ల 'లా'కు 18,615, ఐదేండ్ల 'లా'కు 5,661, పీజీలాసెట్‌కు 2,294 చొప్పున మొత్తం 26,570 దరఖాస్తులొచ్చినట్టు సెట్ కన్వీనర్ బీ విజయలక్ష్మి తెలిపారు.

తిరుమల దర్శనానికి 30 గంటలు

భారీగా పెరిగిన రద్దీ • టోకెన్స్ కోసం భారీ క్యూ

హైదరాబాద్, ఏప్రిల్ 14 (నమస్తే తెలంగాణ): విద్యార్థులకు వేసవి సెలవులు కావడంతో తిరుమల శ్రీవారి దర్శనానికి భారీగా భక్తుల రద్దీ పెరిగింది. విశేష సంఖ్యలో వస్తున్న భక్తులు దివ్య దర్శన టోకెన్ల కోసం పడిగాపులుకాస్తున్నారు. తిరుమలలో వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని అపార్ట్‌మెంట్లు నిండిపోయాయి. నారాయణగిరి ఉద్యానవనంలోని అన్ని షెడ్లు భక్తులతో నిండి క్యూలైన్ ఏటీజీహెచ్ అతిథి గృహం వరకు వ్యాపించి ఉంది. మరో రెండు వారాలు ఈ రద్దీ మరింత పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం సర్వదర్శనం కోసం క్యూలైన్‌లో భక్తులకు దాదాపు 30 గంటల సమయం పడుతున్నది. క్యూలైన్‌లో వేచియున్న భక్తులకు టీటీడీ అన్నప్రసాదం, పాలు, మజ్జిగ అందిస్తున్నది. శ్రీవారి మెట్లమార్గంలో రోజుకు ఇచ్చే 5 వేల టోకెన్స్ అయిపోవడంతో భక్తులకు నిరీక్షణ తప్పలేదు. టైమ్‌స్లాట్, కాలినడక వచ్చే దివ్య దర్శనం భక్తులకు సుమారు 7 గంటల సమయం పడుతుండగా, రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం భక్తులకు సుమారు 5 గంటల సమయం పడుతున్నది. శనివారం తిరుమల శ్రీవారిని 82,139 మంది భక్తులు దర్శించుకున్నారు. 39,849 మంది భక్తులు తలనీలాలు సమర్పించగా, రూ.3.97 కోట్ల హుండీ ఆదాయం వచ్చింది.

దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 15 ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, ఏప్రిల్ 14 (నమస్తే తెలంగాణ): దక్షిణ మధ్య రైల్వేజోన్ పరిధిలో 15 ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేసినట్టు ఆదివారం రైల్వే అధికారులు తెలిపారు. వేసవిలో పెరుగుతున్న ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయం తీసుకొన్నామని పేర్కొన్నారు. ఈ ప్రత్యేక రైళ్లు మే 1 నుంచి ఆగస్టు 2 వరకు షెడ్యూల్ వారీగా రాకపోకలు కొనసాగిస్తాయని తెలిపారు. పాట్నా-సికింద్రాబాద్, హైదరాబాద్-పాట్నా, దనపూర్-సికింద్రాబాద్, దనపూర్-బెంగళూరు వంటి స్టేషన్ల మధ్య ఈ ప్రత్యేక రైళ్లు నడుస్తాయని వివరించారు. రైళ్లు, రిజర్వేషన్ వివరాలకు ఎస్‌సీఆర్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

రెడ్‌మీట్ తింటే పెద్దపేగు క్యాన్సర్!

హైదరాబాద్, ఏప్రిల్ 14 (నమస్తే తెలంగాణ): మాంసాహారాన్ని ఎక్కువగా తినేవారు అప్రమత్తంగా ఉండాల్సిందేనని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. అధిక మొత్తంలో ప్రాసెస్ చేసిన మాంసం, రెడ్ మీట్ తినడం పెద్దపేగు క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతుందని తాజా అధ్యయనం పేర్కొన్నది. తక్కువ పరిమాణంలో తినడం లేదా రెడ్‌మీట్, ప్రాసెస్ చేసిన మాంసానికి ప్రత్యామ్నాయాలను ఎంచుకోవడం ద్వారా ఈ ప్రమాదాన్ని తగ్గించవచ్చని పరిశోధకులు అంటున్నారు. 10 లక్షల మంది పాల్గొన్న ఈ అధ్యయనం జర్నల్ ఆఫ్ క్లినికల్ అంకాలజీలో ప్రచురితమైంది. ఎక్కువగా ప్రాసెస్ చేసిన మాంసాన్ని తినే వ్యక్తులకు పెద్దపేగు క్యాన్సర్ వచ్చే ప్రమాదం 20 శాతం వరకు ఉంటుందని, ఇందులో మరణించే ప్రమాదం 16 శాతం ఉందని ఈ అధ్యయనం చేసిన ప్రధాన రచయిత డాక్టర్ షీనా అయాతుంగయ్ తెలిపింది. అదే సమయంలో రెడ్‌మీట్ ఎక్కువగా తినే వారిలో, ఈ ప్రమాదం 9శాతం పెరిగినట్టు వెల్లడించింది. వీటి స్థానంలో చికెన్, ఫిష్ వంటి ఇతర ప్రోటీన్ వనరులను తీసుకోవడం వల్ల పెద్దపేగు క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించవచ్చని డాక్టర్ అయాతుంగయ్ చెప్పారు.

భారత్‌పై పాశ్చాత్య మీడియా పక్షపాతంపై చర్చాగోష్ఠిలో పాల్గొన్న పాత్రికేయులు

భారత్‌పై పాశ్చాత్య మీడియా పక్షపాతం

సమ్వీత్ కేంద్ర ఆధ్వర్యంలో రసవత్తరంగా చర్చాగోష్ఠి

హైదరాబాద్, ఏప్రిల్ 14 (నమస్తే తెలంగాణ): భారత దేశ చరిత్ర, వర్తమాన పరిణామాల పట్ల పాశ్చాత్య దేశాల మీడియా నిరంతరం పక్షపాత ధోరణితోనే వ్యవహరిస్తున్నదని ప్రముఖ పాత్రికేయుడు, రచయిత ఉమేశ్ ఉపాధ్యాయ పేర్కొన్నారు. సమ్వీత్ కేంద్ర సంస్థ ఆదివారం హైదరాబాద్‌లోని అపర్ణా సైబర్ కమ్యూన్ క్యాంపస్‌లో చర్చా కార్యక్రమం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ఉమేశ్ ఉపాధ్యాయ తన మొదటి పుస్తకం 'వెస్టర్న్ మీడియా నెరేటివ్స్ ఆన్ ఇండియా – గాంధీ టు మోదీ (భారత్‌పై పాశ్చాత్య మీడియా కథనాలు –గాంధీ నుంచి మోదీ వరకు)ని ప్రతిపాదించారు. చారిత్రక కథనాల నుంచి సమకాలీన దృక్కోణాల వరకు భారత్‌ను పాశ్చాత్య మీడియా ఎలా చిత్రీకరించిందో వివరించారు. భారత్ పట్ల పాశ్చాత్య దేశాల అవగాహనను ప్రభావితం చేసిన పలు ఉదాహరణలను ఆయన ప్రస్తావించారు. అనంతరం రచయితతో ఆహూతుల ప్రశ్నోత్తరాల కార్యక్రమం రసవత్తరంగా సాగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ జీ వల్లీశ్వర్, సమ్వీత్ కేంద్ర ప్రెసిడెంట్ డాక్టర్ రాహుల్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల కాపరి సాహసం

చెరువులో మునిగిన ఇద్దరితోపాటు ఎడ్లను కాపాడిన విజయ్

కేసముద్రం, ఏప్రిల్14: మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం తాళ్లపూసపల్లిలో చెరువులో పడిన ఇద్దరితోపాటు ఎడ్లను గొర్రెల కాపరి సాహసం చేసి కాపాడాడు. గ్రామానికి చెందిన పుణ్యపుర్తి ఐలయ్య తన మనువడు అశ్విత్ ఎడ్లబండిపై ఆదివారం సాయంత్రం వ్యవసాయ భూమి నుంచి ఇంటికి వస్తున్నారు. ఎడ్లబండికి వెనకాల ఆవును తాడుతో కట్టుకొని తీసుకొస్తున్నారు. చెరువు వద్దకు వచ్చిన తరువాత ఐలయ్య ఎడ్లకు నీరు తాగించడానికి ఒడ్డుకు తీసుకెళ్లాడు. ఆ ప్రాంతంలో జేసీబీతో మట్టి తవ్వడంతో గుంత ఏర్పడింది. అది కనిపించకపోవడంతో ముందుకెళ్లిన బండి, ఎడ్లు, ఆవుతోపాటు రైతు ఐలయ్య, ఆయన మనువడు అశ్విత్ గుంతలో మునిగిపోయారు. ఇదే సమయంలో గొర్రెలను తోలుకుని ఇంటికి వస్తున్న గొర్రెల కాపరి విజయ్ వారిని గమనించాడు. సాహసంతో చెరువులోకి దిగి.. ఐలయ్య, అశ్విత్‌ను బయటకు తీసుకొచ్చి వారి ప్రాణాలు కాపాడాడు. బండికి ఉన్న ఎడ్లను సైతం ప్రాణాలతో రక్షించాడు. ఆవు నీటిలో మునిగి మృతి చెందింది. గొర్రెల కాపరి విజయ్ ధైర్యాన్ని గ్రామస్థులు అభినందించారు.

దేశాయిపేట రైస్‌మిల్లులో అగ్నిప్రమాదం

రూ.3.30 కోట్ల మేర ఆస్తి నష్టం

మేడిపల్లి, ఏప్రిల్ 14: జగిత్యాల జిల్లా భీమారం మండలం దేశాయిపేట శివారులో విఘ్నేశ్వర పారాబాయిల్డ్ రైస్ మిల్‌లో ఆదివారం జరిగిన అగ్నిప్రమాదంలో భారీ ఆస్తి నష్టం వాటిల్లింది. బాధితుడు ఎస్ జనార్దన్‌రెడ్డి కథనం ప్రకారం.. రైస్ మిల్లు నుంచి ఆదివారం తెల్లవారుజామున పొగలు వస్తున్నాయనే స్థానికుల సమాచారం మేరకు వచ్చి చూడగా అప్పటికే మంటలు భారీగా చెలరేగాయి. వెంటనే ఫైర్ సిబ్బంది వచ్చి మంటలు ఆర్పినప్పటికీ అప్పటికే 22 వేల క్వింటాళ్ల ధాన్యం, 20 వేల ఖాళీ గన్నీ బస్తాలు కాలిబూడిదయ్యాయి. దాదాపు రూ.3.30కోట్ల ఆస్తి నష్టం జరిగిందని బాధితుడు తెలిపారు.

దేశాయిపేట శివారులోని పారాబాయిల్ రైస్ మిల్‌లో కాలిపోతున్న వడ్ల సంచులు

ఎన్‌సీఈటీతో నాలుగేండ్ల బీఈడీ

- జూన్ 12న పరీక్ష నిర్వహణ
- 30 వరకు దరఖాస్తుల స్వీకరణ

హైదరాబాద్, ఏప్రిల్ 14 (నమస్తే తెలంగాణ) : బీఈడీ చదవాలనుకొనే విద్యార్థులకు శుభవార్త. ఇంటర్ పూర్తికాగానే డిగ్రీతో పాటు నేరుగా బీఈడీలో చేరవచ్చు. అంతేకాదు.. రెండేండ్ల బీఎడ్ కోర్సుకు బదులుగా ఏడాదిలోనే ఈ కోర్సును పూర్తిచేయొచ్చు. ఇందుకు అవకాశం కల్పిస్తున్నదే నాలుగేండ్ల ఇంటిగ్రేటెడ్ టీచర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ (ఐటీఈపీ). ఈ కోర్సును రాష్ట్రంలోని మూడు విద్యాసంస్థల్లో నిర్వహిస్తున్నారు. ఐటీఈపీ కోర్సులో ప్రవేశాలకు దేశవ్యాప్తంగా నేషనల్ కామన్ ఎంట్రెన్స్ టెస్టు (ఎన్‌సీఈటీ) పేరిట పరీక్ష నిర్వహిస్తారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ)కి ఈ పరీక్ష నిర్వహణ బాధ్యతలప్పగించారు. 2024 -25 విద్యాసంవత్సరానికి ఎన్‌సీఈటీ ప్రవేశపరీక్షకు ఈ నెల 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. జూన్ 12న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. వివరాలకు www. nta.ac.in, https:ncte.samasth .ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చు.

ఎన్‌సీఈటీ షెడ్యూల్

దరఖాస్తుల స్వీకరణ గడువు	ఏప్రిల్ 30 (రాత్రి 11 : 30 గంటలు)
ఫీజు చెల్లింపునకు గడువు	ఏప్రిల్ 30 (రాత్రి 11: 50గంటలు)
దరఖాస్తుల సవరణ	మే 2 నుంచి 4 వరకు
సిటీ ఎగ్జామినేషన్ విడుదల	మే రెండోవారం
అడ్మిట్‌కార్డుల డౌన్‌లోడింగ్	పరీక్షకు మూడు రోజుల ముందు
పరీక్ష	జూన్ 12

రాష్ట్రంలోని మూడు కాలేజీల్లో 250 సీట్లు

దేశవ్యాప్తంగా 64 విద్యాసంస్థల్లో నాలుగేండ్ల ఐటీఈపీ కోర్సును నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో మూడు విద్యాసంస్థలు ఈ కోర్సును ఆఫర్‌చేస్తున్నాయి. వీటిల్లో 250 సీట్లు అందుబాటులో ఉన్నాయి. మౌలానా అజాద్ ఉర్దూ యూనివర్సిటీలో బీఏ బీఎడ్, బీఎస్సీ బీఎడ్, బీకాం బీఎడ్ మూడు కోర్సులను నిర్వహిస్తున్నారు. ఒక్కో బ్రాంచిలో 50 చొప్పున మొత్తం 150 సీట్లున్నాయి. ఇక ఎన్ఐటీ వరంగల్‌లోనూ బీఎస్సీబీఎడ్ ఒకే ఒక్క కోర్సును నిర్వహిస్తుండగా, 50 సీట్లతో ఈ కోర్సును నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీ లక్షెట్టిపేటలో బీఏ బీఎడ్ కోర్సులో మరో 50 సీట్లున్నాయి.

ఫెయిర్‌నెస్ క్రీములతో కిడ్నీ సమస్యలు!

న్యూఢిల్లీ, ఏప్రిల్ 14: భారత్‌లో వినియోగిస్తున్న 'ఫెయిర్‌నెస్' క్రీములతో కిడ్నీ సమస్యలు తలెత్తుతున్నాయని తాజా అధ్యయనం ఒకటి హెచ్చరించింది. అందమైన ముఖం, కాంతివంతమైన శరీరం కోసం వాడుతున్న ఫెయిర్‌నెస్ క్రీములకు భారత్‌లో పెద్ద ఎత్తున డిమాండ్ ఉంది. ఈ క్రీముల్లో ఉండే మెర్క్యురీ (పాదరసం) కిడ్నీలను దెబ్బతీస్తుందని మెడికల్ జర్నల్ 'కిడ్నీ ఇంటర్నేషనల్' వార్తా కథనం ప్రచురించింది.

నిధులు విడుదల కాలే.. జీతాలివ్వలే!

టీవీవీపీ కమిషనర్ అజయ్‌కుమార్

హైదరాబాద్, ఏప్రిల్ 14 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వం ఇంకా నిధులు విడుదల చేయకపోవడం వల్లే ఉద్యోగులకు వేతనాలు ఇవ్వలేదని తెలంగాణ వైద్య విధాన పరిషత్తు (టీవీవీపీ) తెలిపింది. టీవీవీపీ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులకు వేతనాలు అందని వైనంపై 'నమస్తే తెలంగాణ'లో ఈ నెల 13న ప్రచురితమైన 'ఉగాది దాటినా జీతం పడలే' కథనానికి వైద్యారోగ్య శాఖ స్పందించింది. వేతనాలకు సంబంధించి బడ్జెట్ ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపామని, ఇంకా నిధులు విడుదల కాలేదని టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్ తెలిపారు. ప్రభుత్వం నిధులు విడుదల చేసిన వెంటనే వేతనాలు చెల్లిస్తామని పేర్కొన్నారు.

జగన్‌పై దాడి.. సీఈసీ ఆరా

- వివరాలు అందజేయాలని ఏపీ సర్కారుకు ఆదేశం
- ఘటనపై దర్యాప్తునకు 6 టాస్క్‌ఫోర్స్ బృందాలు
- టూర్ మ్యాప్‌లోని సీసీటీవీ ఫుటేజీలపై ఫోకస్

హైదరాబాద్, ఏప్రిల్ 14 (నమస్తే తెలంగాణ): ఏపీ సీఎం జగన్‌పై రాయి దాడి ఘటనపై కేంద్ర ఎన్నికల సంఘం ఆరా తీసింది. వీఐపీల భద్రతలో వరుస వైఫల్యాలపై ఆందోళన వ్యక్తం చేస్తూ.. ఏకంగా సీఎంపై దాడి జరగటం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఘటనకు సంబంధించిన వివరాలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. రాజకీయ హింస పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. ఏపీకి చెందిన కొందరు పోలీస్ అధికారులపై సీఈసీ చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్టు సమాచారం. చిలకలూరిపేటలో జరిగిన ప్రధాని సభ, సీఎం రోడ్‌షోలో భద్రతా వైఫల్యాలపై కేంద్ర ఎన్నికల సంఘం ప్రశ్నలు సంధించింది. ప్రధాని సభలో భద్రతా వైఫల్యంపై ఇప్పటికే ఐజీ, ఎస్పీలపై బదిలీ వేటు వేసిన సంగతి తెలిసిందే. కాగా, జగన్‌పై దాడి ఘటన దర్యాప్తును పోలీసులు ముమ్మరం చేశారు. టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలోని 6 బృందాలకు కేసును అప్పగించారు. జగన్ బస్సు యాత్ర జరిగిన టూర్ మ్యాప్‌లో ఉన్న సీసీటీవీ ఫుటేజీలపై దర్యాప్తు బృందాలు ఫోకస్ చేసినట్టు సమాచారం. మరో వైపు, దాడికి ఉపయోగించిన రాయిని గుర్తించే